క్లుప్తంగా

ప్రజల సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్ కార్యాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

నింద్ర: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని నగరి ఆర్డీఓ వెంకటరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై ఆయన ఆరా తీశారు. అలాగే అత్తూరు బైపాస్‌రోడ్డుకు సంబంధించిన సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. అలాగే ప్రజాపరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ నాగమణిని ఆదేశించారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మంగళవారం శ్రీరంగరాజపురం మండలంలోని చొక్కమడుగు గ్రామానికి చెందిన అశ్వినీకుమార్ మొదటి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తల్లిదండ్రులు మురళీధర్‌రెడ్డి, సుగుణమ్మ దంపతులు వృద్ధులకు పళ్లు, స్వీట్లు పంచిపెట్టారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ధనుంజయవర్మ, లోకనాథనాయుడు, మాజీ సర్పంచ్ హమీద్, మాజీ ఎంపీటీసీ పురుషోత్తంరాజు, ప్రేమనాథరెడ్డి, పట్టాభిరెడ్డి, చిన్నబ్బరెడ్డి, సుబ్రమణ్యం, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న దృశ్యం

నింద్ర: మండలంలోని నింద్ర పంచాయతీ మిట్టకండ్రిగ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా పరిసరాలను శుభ్రం చేసి పారిశుద్ధ్య పనులు మంగళవారం చేపట్టారు. స్థానిక సర్పంచ్ బాబురెడ్డి ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకు వద్ద లికేజీ, పిచ్చిమొక్కలను తొలగించారు. అదేవిధంగా దళితవాడలో కూడా పరిసరాలను శుభ్రం చేశారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించండి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్మించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎంపీపీ శ్యామల అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు మండల విస్తరణాధికారి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ శ్యామల మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల తాగునీరు కలుషితం కావడం వల్ల గ్రామాల్లో డయేరియా, మలేరియా వంటి వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అందుకే ప్రతి పంచాయతీల్లో మినరల్ వాటర్‌ప్లాంట్ నిర్మించి స్వచ్ఛమైన నీరు అందించాలని తెలిపారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు తక్షణం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పారిశుద్ధ్య కార్మికులతో పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అయ్యప్ప, ధరణి

పాలసముద్రం : గ్రామాల్లో పరిసరాల శుభ్రత బాధ్యత సంబంధిత పారిశుద్ధ్య కార్మికులపై ఉందని సర్పంచ్ అయ్యప్ప, పంచాయతీ కార్యదర్శి ధరణి తెలిపారు. మంగళవారం ఆరోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ అయ్యప్ప మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఇళ్ల పరిసరాల్లో నీరు నిలుస్తోందని, దోమలు వృద్ధి చెంది రోగాలు వచ్చే అవకాశం ఉందని, తక్షణం వర్షపు నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. సాయంత్రం మలాథిన్ మందు పిచికారీ చేయాలన్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలని సూచించారు. గ్రీన్ అంబాసిడర్లు ముఖ్యంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని తడి-పొడి చెత్తను తీసుకెళ్లాలని తెలిపారు. అనంతరం కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కొరవడుతున్న వసతి

ప్రభుత్వ వసతి గృహాల్లో సౌకర్యాలు కొరవడుతున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో పాటు అధికారుల నిర్లక్ష్యం ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా హాస్టళ్లలోని విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదు. నాసిరకమైన కూరగాయలతో వండి పెడుతున్నారని విద్యార్థులు చెబుతున్నారు. దానికితోడు ప్రస్తుతం వర్షాకాలం కావడంతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఆర్‌ఓ ప్లాంట్లు సరిగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు.

- ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కరువు
- నాసిరకం భోజనంతో అనారోగ్యం పాలవుతున్న విద్యార్థులు
- లోపిస్తున్న పర్యవేక్షణ
- వసతిగృహాలను వేధిస్తున్న సిబ్బంది కొరత



విజయపురం హాస్టల్‌లో తక్కువ సంఖ్యలో ఉన్న విద్యార్థులు

నగరి/పుత్తూరు/కార్వేటినగరం: ప్రభుత్వ హాస్టళ్లలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది నాసిరకమైన భోజనం పెడుతున్నా వారిని ప్రశ్నించే వారు లేరు. గత ప్రభుత్వం వసతిగృహాల్లోని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మెనూ ప్రకారం భోజనం అందించేది. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక విద్యాసంవత్సరం వసతి గృహాల్లోని విద్యార్థుల పట్ల పర్యవేక్షణ కొరవడింది. గతంలో ఇక్కడ పని చేసిన వార్డెన్లు ప్రభుత్వం మారడంతో వేరే చోటకు బదిలీ చేయించుకోవడానికి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో హాస్టళ్లలోని విద్యార్థుల పర్యవేక్షణ లేకుండా పోయింది. దీనికితోడు ఇటీవల కూరగాయల రేట్లు భారీగా పెరిగాయి. దీంతో నిర్వాహకులు నాసిరకమైన కూరగాయలు తెచ్చి వాటితోనే విద్యార్థులకు భోజనం చేసి పెడుతున్నారు. ఆ ఆహారం తిన్న విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. దీనికి తోడు బాత్ రూమ్‌లు, వంటగది అపరిశుభ్రంగా ఉంటున్నాయి. అయితే నిర్వాహకులు మాత్రం నిధులు కాజేస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి.

వందలమందికి ఒక్కరే వంట మనిషి..

పుత్తూరులోని ఎస్సీ ప్రీ మెట్రిక్ హాస్టల్లో మొత్తం 90 మంది పిల్లలు ఉన్నారు. అలాగే స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 105 విద్యార్థులు ఉన్నారు. ఇంతమందికి ఒక్కరే వంట మనిషి ఉన్నారు. గతంలో ఇద్దరు ఉండగా ఒకరు రెండు నెలల కిందట రిజైన్ చేశారు. ఈ ఖాళీని నేటికీ భర్తీ చేయకపోవడంతో ఒక్కరే ప్రతిరోజూ 105 మందికి భోజనాలు చేయాల్సి వస్తోంది. ఇలా ప్రతి వసతిగృహంలో ఏదో ఒక సమస్య పిల్లలను వెంటాడుతోంది. ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి, తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వర్షం వస్తే ఆగం..

నగరి పట్టణంలో ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లు ఉన్నాయి. ఎస్సీ బాలుర హాస్టల్‌లో 53 మంది విద్యార్థులు, బాలికల హాస్టల్‌లో 32 మంది విద్యార్థినులు, జూనియర్ కళాశాలకు చెందిన 22 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ హాస్టళ్లు అన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. హాస్టల్ సమీపంలోని నీటిగుంట ఉండడంతో వర్షం వచ్చే సమయాల్లో గుంటలో నీరు నిండి హాస్టల్ చుట్టూ నిలుస్తోంది. అలాంటి సమయాల్లో హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లడం సమస్యగా మారుతోంది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సమస్యను పరిష్కరించే నిర్మాణాల నిమిత్తం ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి వెళ్లారని వార్డెన్ చంద్రకళ తెలిపారు.

శిథిలావస్థలో నింద్ర హాస్టల్ భవనం..

మండల కేంద్రం నింద్రలో బీసీ హాస్టల్ భవనం శిథిలావస్థకు లోను కాగా అద్దె భవనంలో నడుపుతున్నారు. 45 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉన్నారు. ఇన్‌చార్జ్ వార్డెన్ ఉన్నారు. అద్దె భవనం కావడంతో వసతులు అంతంత మాత్రమే ఉన్నాయి. శ్రీరామపురంలోని బీసీ హాస్టల్ విద్యార్థులు లేకపోవడంతో మూతబడింది.



నగరి ఎస్సీ హాస్టల్ పక్కనే మురుగునీటి గుంట, చుట్టూ అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

విజయపురంలో అంతంత మాత్రమే..

విజయపురంలో రెండు బీసీ హాస్టళ్లు ఉన్నాయి. మండలకేంద్రం విజయపురంలో ఉన్న హాస్టల్ అద్దె భవనంలో జరుగుతోంది. ఇక్కడ వార్డెన్ రెగ్యులర్ లేదు ఇన్‌చార్జ్ వార్డెన్ ఉన్నారు. 60 మంది విద్యార్థులు ఉండాల్సిన హాస్టల్‌లో దూరం నుంచి వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గినందున 11 మంది మాత్రమే ఉన్నారు. జంబాడ హాస్టల్ సొంత భవనంలో ఉంది. 50 మందికి గానూ 19 మంది ఉన్నారు. రెగ్యులర్ వార్డెన్ లేరు.



పాలసముద్రంలో బీసీ వసతి గృహంలో మరమ్మతులకు గురైన వాటర్‌ప్లాంట్



నింద్ర ప్రభుత్వ హాస్టల్ భవనం చుట్టూ అపరిశుభ్రంగా పరిసరాలు

ఖాళీగా వార్డెన్ పోస్టులు

కార్వేటినగరం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో వార్డెన్ల కొరతతో విద్యార్థులు వసతి గృహాలకు దూరమవుతున్నారు. పేద విద్యార్థులకు విద్యాబోధనలు అందించడానికి గత ప్రభుత్వం వసతిగృహాల్లో ప్రతిష్టాత్మకమైన మెనూ అందిస్తూ ప్రతిరోజూ విందు భోజనం వడ్డించేవారు. అయితే నేడు వార్డెన్ల కొరత ఎక్కువ ఉండడం వల్ల విద్యార్థులు వసతి గృహాల్లో చేరేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో వసతి గృహాలు వెలవెలబోతున్నాయి. అదేవిధంగా కార్వేటినగరంలో ఉన్న వసతిగృహాలకు విద్యార్థులు చదివే పాఠశాలలకు సుమారు 3 కిలోమీటర్ల దూరం ఉండడంతో, ప్రభుత్వం విద్యార్థులకు వాహన సౌకర్యాలు కల్పించపోవడంతో బాలికలు, చిన్నారులు వసతి గృహాల్లో చేరేందుకు నిరాకరిస్తున్నారు. వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నా వార్డెన్ల కొరత ఉండడంతో ఆలనాపాలన కరువైందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వసతి గృహాల నుంచి పాఠశాలల వరకు వాహన సౌకర్యం కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో హాస్టళ్ల వివరాలు...

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 20 వసతి గృహాలు ఉన్నాయి. అందులో బీసీ వసతి గృహాలు 5, కాలేజీ వసతి గృహాలు 2, ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాలు 13, అలాగే గంగాధరనెల్లూరు మండలం బంగారెడ్డిపల్లి వద్ద బాలికల గురుకుల వసతి గృహం 1 ఉంది.

కలుషిత నీరు వల్లే..



పాలసముద్రం మండలంలోని వెంగళరాజుకుప్పం బీసీ బాలుర వసతి గృహం. అలాగే పాలసముద్రంలో బీసీ బాలికల వసతిగృహం ఉంది. భోజన వసతి బాగున్నా, మినరల్ వాటర్ సౌకర్యం లేదు. బోరు నీటిని తాగడం వల్ల ప్రతి ఒక్కరికీ జ్వరాలు వస్తున్నాయి. వైద్యసిబ్బంది వైద్య సౌకర్యాలు అందిస్తున్నారు.

– శ్రీజ, విద్యార్థిని, పాలసముద్రం బీసీ హాస్టల్, పాలసముద్రం

ఎరువుల వినియోగంపై అవగాహన



ఎరువుల వినియోగంపై వివరిస్తున్న ఏఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం : ప్రస్తుతం వరి పంటలో దిగుబడుల కోసం రైతులు నత్రజని, బాస్వరం ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారని, పొటాష్ ఎరువులకు అంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని, తద్వారా ఎరువుల సమతుల్యత లోపించి దిగుబడులు తగ్గుతాయని వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం పాలసముద్రంలో వరిలో సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నత్రజని మోతాదు తగ్గించి పొటాష్‌ను ఎకరాకు 26 కిలోల వంతున వాడడం వల్ల వరిలో ఆశించిన మేర దిగుబడులు పొందవచ్చన్నారు. వరిలో పొటాష్ ఎరువులను రేగడి, చౌడు నేలల్లో అయితే ఆఖరి దుమ్ములో ఒకేసారి 26 కిలోలు వాడుకోవాలన్నారు. చల్కా(తేలిక) భూముల్లో అయితే ఆఖరి దమ్ములో 13 కిలోలు, అంకురం ఏర్పడే దశలో 13 కిలోల వంతున వాడుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువులను వాడనందు వల్ల నేల జీవం కోల్పోయి క్రమేణా పంట ఉత్పాదక శక్తి క్షీణిస్తుందని తెలిపారు. శాస్త్రవేత్తలు స్థానికంగా లభించే జీవన ఎరువులను వాడుకుని రసాయన ఎరువులను 25 శాతం తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

- ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుక అక్రమాలను అరికట్టాలి
- నియోజకవర్గంలో గతంలో ఇచ్చిన క్వారీ లైసెన్సులను రద్దు చేయాలి
- సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య

నగరి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్రప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ పరిధిలో కార్యదర్శి వేలన్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నగరి ఎమ్మెల్యే ఇక్కడే ఇసుక రీచ్‌ను ఏర్పాటుచేసి అక్రమంగా తరలివెళ్లే ఇసుకను కట్టడి చేయాలన్నారు. క్వారీలకు గతంలో ఇచ్చిన లైసెన్సులు రద్దు చేసి వాటికి సంబంధించి అక్రమ మట్టి తరలింపుపైనా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ పరిధిలో గతంలో టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్ల కోసం అప్పట్లో మున్సిపల్ కమిషనర్ ఖాతాలో డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. అయితే నాగరాజుకుప్పం దగ్గర టిడ్కో ఇళ్లకు సంబంధించి ఫౌండేషన్ వరకు వేసి ఆపివేయడం జరిగిందని, లబ్ధిదారులకు డబ్బులు తిరిగి చెల్లించలేదన్నారు. డబ్బులు చెల్లించిన వారికి వాటిని తిరిగి ఇప్పించి లబ్ధి చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు బాషా, విజయ్ కుమార్, శేఖర్, సిరాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నియంత్రణే లక్ష్యం

పాలసముద్రం : కుష్టు వ్యాధి నిర్మూలన అందరి లక్ష్యం కావాలని తిరుపతి రివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ కీర్తి తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి మోహన్‌కృష్ణ, లోకేష్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలకు కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారి గుర్తింపుపై అవగాహన కార్యక్రమ చేపట్టారు. వారు మాట్లాడుతూ కుష్టు వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఆహార అలవాట్లపై శ్రద్ధ తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కార్వేటినగరం: మండల కేంద్రం కార్వేటినగరంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న మహాభారత వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి వడిబాల సమర్పించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపానికి అమ్మవారిని తీసుకొచ్చి ధర్మరాజులు, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవమూర్తులతో పాటు శ్రీకృష్ణుడి సమక్షంలో స్వామివారి కల్యాణాన్ని వేద పండితులు ముత్యాల తలంబ్రాలు పోసి, కనులవిందుగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. కల్యాణోత్సవానికి రెడ్డి కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబు రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

వైభవంగా ఆణివారి ఆస్థానం



ఆణివారి ఆస్థానంలో కొలువుదీరిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆణివారి ఆస్థానం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అలాగే శుద్ధి తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో కొలువుదీర్చారు. వేదపండితులు వేద మంత్రాలతో ఆణివారి ఆస్థానం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఆణివారి ఆస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు నారాయణదాసరి, గోపాలాచారి, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార లోపం లేకుండా చూడండి



వసతి గృహంలో సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి హేమశ్రీ

కార్వేటినగరం: విద్యార్థులకు పోషకాహారాలు లోపం లేకుండా చూడాలలని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమశ్రీ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బాలికల ఇంటిగ్రేటెడ్ వసతిగృహాన్ని, అలాగే బాలుర వసతి గృహాలను వైద్యాధికారి డాక్టర్ హేమశ్రీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వార్డెన్లు పరిశుభ్రత ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా నీరు నిల్వ ఉంచే పరికరాలను వారంలో ఒక్కరోజు శుభ్రం చేసి ఎండబెట్టాలని సూచించారు. విద్యార్థులు వాడే స్నానపు గదులు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వర్షాల కారణంగా వసతి గృహాల్లో దోమలు బెడద లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతర విద్యార్థులకు హ్యాండ్‌వాషింగ్‌పై అవగాహన కల్పించారు. అలాగే ఆహారపు నియమ నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో వార్డెన్లు హేమలత, వినయ్, పర్యవేక్షకులు త్యాగు, ఏఎన్ఎం శిరీష, ఎంఎల్‌హెచ్‌పీ లత, ఆశా వర్కర్ కుమారి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 28 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, కంపెనీ ప్రతినిధులు

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంఆర్‌ఎఫ్ కంపెనీ ట్రైనీల కోసం మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. 31 మంది మేళాకు హాజరు కాగా కంపెనీ ప్రతినిధులు కణ్ణన్, సెల్వ కుమార్, పాల్, వెంకటరామన్, డేవిడ్ రాతపరీక్ష, ఇంటర్వ్యూలు చేశారు. వీరిలో 28 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఎంపికైన వారికి మొదటి సంవత్సరం రూ.19,500, రెండవ సంవత్సరం రూ.20,500, మూడవ సంవత్సరం రూ.21,500 ఇతర భత్యాలు చెల్లిస్తారన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం జీతం ఎంత అని ఆలోచించకుండా, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమలోని జ్ఞానం, నైపుణ్యాలను ప్రదర్శించడానికి, సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి అవకాశంగా భావించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కర రాజు, జేకేసీ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ డా.రేవతి, మెంటార్ లాల్ బాషా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



జీడీనెల్లూరు వసతిగృహంలోని విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని బాలుర, బాలికల వసతి గృహం, డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి, డాక్టర్ దివ్య వైద్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో ముందుగా వసతి గృహాల్లో ఉన్న బాల, బాలికలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు వైద్యశిబిరం నిర్వహించినట్లు వారు తెలిపారు. వసతిగృహాల్లో ఎవరికీ ఆరోగ్య సమస్యలు లేవన్నా. అలాగే వసతి గృహాల్లో పరిసరాలను విద్యార్థులు శుభ్రంగా ఉంచుకోవాలని, చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, ఆశ వర్కర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై అవగాహన

గంగాధరనెల్లూరు: పశువుల గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన ముఖ్యమని, పశువుల ఆరోగ్యం క్షీణించిన వెంటనే ఆస్పత్రికి, లేదా వైద్యులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు ప్రభాకర్ తెలిపారు. మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో మండలంలోని నందనూరు గ్రామంలో రైతులకు పశువులకు సోకే గర్భకోశ వ్యాధుల చికిత్స, దాని నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గర్భకోశ వ్యాధుల గురించి రైతులకు వివరించారు. 78 దూడలకు నట్టల నివారణ, 22 సాధారణ చికిత్స, 53 గర్భకోశ వ్యాధులకు ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు ప్రభాకర్, పుత్తూరు ఉపసంచాలకులు డాక్టర్ గోవిందయ్య, జీడీనెల్లూరు మండల సహాయ సంచాలకులు డాక్టర్ మురళీమోహన్, పశువైద్యశాస్త్ర చికిత్సకులు డాక్టర్ నాగాంజనేయులు, డాక్టర్ యశస్వి, డాక్టర్ శ్రీనాథ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





రైతులకు ఉచితంగా మందులు అందజేస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు ప్రభాకర్, పశువులకు వైద్యచికిత్స చేస్తున్న డాక్టర్ నాగాంజనేయులు